క్లుప్తంగా

ఘనంగా గౌరీదేవి నిమజ్జనం



గౌరీదేవిని ఊరేగింపుగా తీసుకెళుతున్న ఆర్యవైశ్య మహిళలు

మైదుకూరు : మైదుకూరులో ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో ఆదివారం గౌరీదేవి నిమజ్జన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. స్థానిక అమ్మవారిశాలలో ప్రతిష్ఠించిన గౌరీదేవికి మూడు రోజులపాటు ప్రత్యేక పూజలు, నోములు, హోమాలు నిర్వహించారు. ఆదివారం అమ్మవారిశాల నుంచి ఊరేగింపుగా తీసుకెళ్లి పట్టణ శివారులోని ఎర్ర చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య మహిళా మంలి అధ్యక్షురాలు మాలేపాటి పద్మజ, కార్యదర్శి భూపలం లత, ఉపాధ్యక్షులు యాదాళ్ల లక్ష్మీదేవి, కోట రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

పోరుమామిళ్ల : స్థానిక శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో 5 రోజులుగా ఉదయం, సాయంత్రం మహిళలు శ్రీ మంగళగౌరీదేవి వ్రతం ఆచరించారు. శుక్రవారం మంగళగౌరీదేవికి లక్షకుంకుమార్చన చేశారు. ఆదివారం మంగళగౌరీదేవిని తీసుకుని మహిళలు బ్రహ్మంగారిమఠం దగ్గరున్న తెలుగుగంగ రిజర్వాయర్‌లో నిమజ్జనం చేశారు. అనంతరం అక్కడే కార్తీక వనభోజనాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు తులసి సురేష్‌బాబు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

నేడు అయ్యప్ప గ్రామోత్సవం

కలసపాడు : స్థానిక ఉమామహేశ్వరస్వామి ఆలయం నుండి వైఎస్సార్ సర్కిల్ వరకు సోమవారం అయ్యప్పస్వామి గ్రామోత్సవం నిర్వహిస్తున్నట్లు గురుస్వామి ఎద్దుల వెంకటరత్నం, ఆలయ ధర్మకర్త పి.సీతారామిరెడ్డిలు తెలిపారు. ఉదయం గణపతిపూజ, తీర్థప్రసాద వినియోగం ఉంటుందన్నారు. మధ్యాహ్నం, రాత్రి గంగాయపల్లెకు చెందిన ముట్టిచెన్నయ్య, ముట్టిచంద్రశేఖర్‌ల ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఉంటుందన్నారు. గ్రామోత్సవం సందర్భంగా చిన్నారులచే ప్రమిదల వెలుగులతో టీటీడీ అన్నమయ్య కళాకారులచే సాంస్కృతిక ప్రదర్శన, కర్ణాటక కళాకారుల వేషధారణలు, కనకదుర్గ అయ్యప్ప బృందాలచే కోలాటం, శ్రీసత్యసాయి చెక్కభజన, మంగళూరు మహిళలతో బ్యాండు, కడప డ్రమ్స్ వాయిద్యాలు ఉంటాయని ఆయన తెలిపారు.

దుప్పట్ల పంపిణీ

ప్రొద్దుటూరు కల్చరల్ : పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఉన్న యాచకులు, అనాథలకు వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో దుప్పట్లను పంపిణీ చేశారు. శనివారం అర్ధరాత్రి రామేశ్వరం, మైదుకూరు రోడ్డు, కొత్త బస్టాండు, శివాలయం వీధి తదితర ప్రాంతాల్లో తిరుగుతూ చలికి వణుకుతూ, దోమల వల్ల ఇబ్బందులు పడుతున్న యాచకులు, పేదలు, అనాథలకు వివేకానంద ఫౌండేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి దుప్పట్లను అందించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు శ్రీనివాసరెడ్డి, వెంకట సురేష్, నరసింహా, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

6న మండల సమావేశం

కాశినాయన : 6వ తేదీన ఎంపీపీ నల్లేరు పోలమ్మ అధ్యక్షతన నరసాపురం మండల పరిషత్ సభా భవనంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ మైథిలి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశంలో రెవెన్యూ, వ్యవసాయం, ఆరోగ్యం, తాగునీరు, ఉపాధి, రోడ్లు, భవనాలకు సంబంధించిన శాఖల పనితీరుపై చర్చ జరుగుతుందన్నారు. మండలస్థాయి అధికారులు తమ నివేదికలతో హాజరు కావాలన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, గ్రామ పంచాయతీ సెక్రటరీలు సమావేశానికి హాజరు కావాలని ఆమె కోరారు.

ఖురాన్‌పై కంఠస్థ పోటీలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఖురానిక్ స్టడీస్ ప్రతినిధులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీనివాసనగర్‌లోని రేడియన్స్ హైస్కూల్‌లో ఆదివారం యునైటెడ్‌ఫోరం ఫర్ ఖురానిక్ స్టడీస్ ఆధ్వర్యంలో ఖురాన్‌పై కంఠస్థ పోటీలను నిర్వహించారు. 40 మంది విద్యార్థులు పాల్గొనగా నలుగురు విజేతలుగా నిలిచారని, వీరు విజయవాడలో జరిగే ఫైనల్ పోటీలో పాల్గొంటారని సంస్థ జిల్లా బాధ్యులు మొహిద్దీన్ తెలిపారు. పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర బాధ్యులు మౌలానా అమీన్ ఉమ్రి, అబ్దుల్ అలీమ్ ఉమ్రి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓటు హక్కు నమోదు చేసుకోండి

దువ్వూరు : 18 ఏళ్లు నిండిన ప్రతి ఓటరుగా నమోదు చేసుకోవాలని మైదుకూరు నియోజకవర్గ ఎలక్టో రిజిస్ట్రేషన్ అధికారి కౌసర్‌భాను పేర్కొన్నారు. ఆదివారం మండలంలోని చింతకుంట గ్రామంలోని పోలింగ్ కేంద్రాలను ఆమె పరిశీలించారు. గ్రామంలోని పోలింగ్ కేంద్రాల స్థితిగతులను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల నమోదు, తొలగింపుల్లో ఎక్కడా లోపాలు లేకుండా చేయాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమకుమారి, ఎన్నికల డిప్యూటీ తహసీల్దార్ బాబా ఫక్రుద్దీన్ పాల్గొన్నారు.

సర్కారు బడి.. సౌకర్యాల ఒడి

- నాడు– నేడుతో మహర్దశ
- ప్రైవేటుకు దీటుగా వసతుల కల్పన
- ఏటా పెరుగుతున్న విద్యార్థుల సంఖ్య



వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం తింటున్న విద్యార్థినులు

ప్రొద్దుటూరు : గతంలో సర్కారు బడులు అనగానే కూలుతున్న భవనాలు, పెచ్చులూడిన గోడలు, విరిగిపోయిన తలుపులు, ఊడిపోయిన కిటికీలు, కూర్చోవడానికి వీలులేని బెంచీలు.. పాలకుల నిర్లక్ష్యంగా ప్రభుత్వ పాఠశాలలు అధ్వానంగా తయారవ్వగా.. వైఎస్సార్సీపీ ప్రభుత్వ పాలనలో అద్భుతంగా మారాయి. విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలతో కార్పొరేటుకు దీటుగా సర్కారు పాఠశాలలు మారాయి. నాడు– నేడు కార్యక్రమంతో పాఠశాలల రూపురేఖలే మారిపోయాయి. దీంతో ప్రైవేట్ పాఠశాలలను మానుకొని ప్రభుత్వ పాఠశాలల్లో చేరడానికి విద్యార్థులు ఆసక్తి చూపుతున్నారు. విద్యార్థులతో సర్కారు పాఠశాలలన్నీ కళకళలాడుతున్నాయి. అందుకు నిదర్శనమే ప్రొద్దుటూరులోని మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల.

నో అడ్మిషన్ అనే బోర్డు పెట్టే పరిస్థితి

ప్రొద్దుటూరు మున్సిపాలిటీ పరిధిలోని ఎద్దుల వెంకటసుబ్బమ్మ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాలలో ప్రస్తుతం విద్యార్థినుల సంఖ్య 1056గా ఉంది. ఈ సంఖ్య జిల్లాలోని తొలి ఐదు పాఠశాలల్లో నమోదైంది. మన బడి నాడు–నేడు కింద రూ.65 లక్షలు మంజూరైంది. ఈ నిధులతో ప్రహరీని నిర్మించడం, మినరల్ వాటర్ సౌకర్యం కల్పించడం, కిచెన్ షెడ్, క్రీడా మైదానం అభివృద్ధి, తరగతి గదికి నాలుగు ఫ్యాన్లు, మరుగుదొడ్ల సౌకర్యం, చేతులు శుభ్రం చేసుకునేందుకు కుళాయిలు ఏర్పాటు చేశారు. పాఠశాలలో విద్యార్థినులకు అవసరమైన సౌకర్యాలు అన్నీ ఉండటంతోపాటు ఉపాధ్యాయుల విధి నిర్వహణ ప్రభావంగా ఏటా అడ్మిషన్లు పెరుగుతున్నాయి. తరగతి గదులు లేని కారణంగా చివరలో నో అడ్మిషన్ అనే బోర్డును పెట్టేంత పరిస్థితి ఏర్పడింది. గతంలో కేవలం విద్యార్థులకు మధ్యాహ్నం పప్పన్నం మాత్రమే పెట్టేవారు. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక గోరుముద్ద పథకాన్ని ఏర్పాటు చేసింది. రోజూ ప్రత్యేక మెనూను అమలు చేస్తున్నారు. రోజు మార్చి రోజు రాగిమాల్ట్, చిక్కీలను విద్యార్థినులకు ఇస్తున్నారు. శనివారం ఇచ్చే స్వీట్ పొంగల్‌ను పిల్లలు సంతోషంగా తింటున్నారు. గతంలో కొంత మంది విద్యార్థినులు అన్నం సరిగా లేదని ఇళ్ల నుంచి క్యారీలు తెచ్చుకునే పరిస్థితి ఉండగా, ప్రస్తుతం అందరూ పాఠశాలలోనే భోజనం తింటున్నారు. మన బడి నాడు–నేడు పథకాని కంటే ముందు పాఠశాలలో కేవలం 700 మంది లోపు మాత్రమే విద్యార్థినులు చదువుకునేవారు.

- ■ పాఠశాలకు మొత్తం 18 తరగతి గదుల్లో ఐఎఫ్‌పీ (ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్) ఏర్పాటు చేశారు. ఉపాధ్యాయులు ఐఎఫ్‌పీల ద్వారానే విద్యాబోధన చేస్తున్నారు.
- ■ పాఠశాలలో చదువుతున్న విద్యార్థినులందరికీ జగనన్న అమ్మ ఒడి వచ్చింది.
- ■ గతంలో పాఠశాలకు అవసరమైన ఫ్యాన్లు కావాలన్నా మున్సిపాలిటీ చుట్టూ ఉపాధ్యాయులు పలుమార్లు ప్రదక్షిణలు చేయాల్సి వచ్చేది. మన బడి నాడు–నేడు నిధుల కారణంగా ఈ సమస్య పరిష్కారమైంది.
- ■ ఈ పాఠశాలలో చదివిన సోముల వెంకటరామశరణ్య ఈ ఏడాది పదో తరగతిలో 590 మార్కులు సాధించి జిల్లా టాపర్‌గా నిలిచారు. అలాగే ఇదే పాఠశాలకు చెందిన షేక్ నజహత్ నఫీస్ (571), కొడవెండ్ల మసూద్ (555) మార్కులు సాధించారు. వెంకటరామశరణ్యకు ప్రభుత్వం ద్వారా కలెక్టర్ విజయరామరాజు రూ.50 వేలు బహుమతిగా ఇవ్వగా, పలువురు ప్రోత్సాహక బహుమతులు అందించారు. టెన్త్‌లో 96 శాతం మంది విద్యార్థినులు పాస్ అయ్యారు. నియోజకవర్గంలో ప్రథమ స్థానం సాధించిన టెన్త్ విద్యార్థులకు ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి నగదు బహుమతులు అందించారు.
- ■ ప్రభుత్వ ఉద్యోగులు వంద మందికిపైగా తమ పిల్లలను ఈ పాఠశాలలో చేర్పించారు.
- ■ ఆయా తరగతి గదులకు సంబంధించి సెక్షన్లవారిగా ప్రధానోపాధ్యాయుడు వాట్సాప్ గ్రూపులను తయారు చేశారు. ఉదయం 9.30 గంటలలోపు విద్యార్థినులు పాఠశాలకు రాకుంటే.. మెసేజ్ పంపడం జరుగుతుంది. ఒకటి రెండు రోజులు అలాగే గైర్హాజరైతే ఇంటికి ఫోన్ చేసి ఉపాధ్యాయులు అడుగుతున్నారు.
- ■ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పెనుగొండ కాశీప్రసాద్‌రెడ్డి పూర్తి అంకిత భావంతో విధులు నిర్వహిస్తున్నారు. దాదాపుగా 30 ఏళ్లుగా పని చేస్తున్న ఈయనకు మంచి గుర్తింపు ఉంది. సాధారణంగా పాఠశాల పని వేళలు ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు మాత్రమే. ఈయన మాత్రం రోజు ఉదయం 7.45 గంటలకు పాఠశాలకు రావడం, సాయంత్రం 6 గంటల వరకు ఉండటం జరుగుతోంది. ఉదయం 8 గంటలకు పాఠశాలలో స్టడీ అవర్స్ నిర్వహిస్తున్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన గ్రంథాలయానికి అవసరమైన పుస్తకాలను దాతల ద్వారా సేకరించారు. పేద విద్యార్థుల చదువు కోసం ఈయన ఎప్పుడూ తన వంతు ఆర్థిక సహాయం చేస్తున్నారు. మీరు ఉన్నత స్థాయికి వెళ్లాక మీలాగా చదువు కోసం ఇబ్బందులు పడే వారికి సాయం చేయాలని కోరుతున్నారు. పాఠశాలలో చదివి ఉన్నత స్థాయికి వెళ్లిన విద్యార్థుల ద్వారా పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు.



ఐఎఫ్‌పీ ప్యానల్ ద్వారా బోధిస్తున్న ప్రధానోపాధ్యాయుడు కాశీ ప్రసాద్‌రెడ్డి



పాఠశాలలో ఏర్పాటు చేసిన మినరల్ వాటర్ ప్లాంట్

నక్కకు నాగ లోకానికి ఉన్నంత తేడా ఉంది



విద్య విషయంలో ప్రభుత్వం చూపుతున్న చొరవ గత ప్రభుత్వానికి, ఈ ప్రభుత్వానికి నక్కకు నాగలోకానికి ఉన్నంత తేడా ఉంది. చిన్న చిన్న అవసరాల కోసం మున్సిపల్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వచ్చేది. ఇప్పుడు అన్ని సౌకర్యాలను ప్రభుత్వం సమకూర్చింది. చదువు చెప్పే ఉపాధ్యాయులకు అన్ని సౌకర్యాలు ఉన్నాయి. నాలాంటి వారికి ఇది మరింత ప్రోత్సాహాన్నిచ్చింది.

– పెనుగొండ కాశీప్రసాద్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రొద్దుటూరు

నాలాగా ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు చదువుతున్నారు



మా తండ్రి రామసుబ్బయ్య పోలీసు కానిస్టేబుల్గా పని చేస్తున్నారు. గతంలో నేను ఓ కార్పొరేట్ స్కూల్లో చదివాను. అక్కడి నుంచి ఈ పాఠశాలలో చేరా. చుట్టుపక్కల అనేక కార్పొరేట్ పాఠశాలలు ఉన్నా ఎక్కడా ఐఎఫ్‌పీ విద్యావిధానం లేదు. నాలాగా చాలా మంది ప్రభుత్వ ఉద్యోగుల పిల్లలు ఈ పాఠశాలలో చదువుతున్నారు.

– వై.శ్రీలక్ష్మి, పదో తరగతి విద్యార్థిని, వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రొద్దుటూరు

ప్రైవేటు స్కూల్ నుంచి చేరాను



గతంలో నేను ప్రైవేటు స్కూల్లో చదివాను. తర్వాత స్కూల్ బాగుందని చెప్పడంతో ఇక్కడ చేరాను. పాఠశాలలో అన్ని సౌకర్యాలు ఉన్నాయి. చక్కను విద్యను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. తల్లి టైలర్‌గా ఉండగా, తండ్రి ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారు.

– ఎస్.సుహానభాను, 8వ తరగతి, వైవీఎస్ మున్సిపల్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రొద్దుటూరు

అభివృద్ధి నిరోధకుడిగా వరదకు ముద్ర

ప్రొద్దుటూరు : 40 ఏళ్లపాటు రాజకీయాల్లో ఉండి, 25 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా వివిధ ప్రభుత్వాల్లో పని చేసిన మాజీ ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి అభివృద్ధి నిరోధకుడిగా నియోజకవర్గంలో ప్రజలు ముద్ర వేసిన విషయం తెలియంది కాదని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. సుదీర్ఘకాలం రాజకీయాల్లో ఉండి ఆవగింజంతైనా అభివృద్ధి చేయలేని ఆయన ఇప్పుడు అభివృద్ధి గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. ఆయన పట్టణాభివృద్ధికి సలహాలు ఇవ్వడం హాస్యాస్పదమన్నారు. స్థానిక వైఎంఆర్ కాలనీలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి కార్యాలయంలో ఆదివారం విలేకరులతో ఎమ్మెల్యే మాట్లాడారు. ప్రజలు అధికారాన్ని కట్టబెట్టినప్పుడు, తనకు అనుకూలమైన ప్రభుత్వాలు అధికారంలో ఉన్నప్పుడు చేయలేని అభివృద్ధి.. 83 ఏళ్ల వయసులో ఇప్పుడు మూడు నెలల్లో పారిశుధ్యాన్ని అదుపులో పెట్టొచ్చని చెప్పడం హాస్యాస్పదమని అన్నారు. 25 ఏళ్లు ఎమ్మెల్యేగా ఉండి 25 రోజులు కూడా చెప్పుకోలేని అభివృద్ధి చేయలేదని విమర్శించారు. పట్టణ ప్రజలకు తాగునీటిని ఇప్పిస్తానని వైఎస్ రాజశేఖరరెడ్డి ద్వారా కుందూ–పెన్నా వరద కాలువ కాంట్రాక్టు వరద కుమారుడు కొండారెడ్డికి మంజూరు చేయించుకుని పూర్తి చేయలేదని తెలిపారు. రూ.150 కోట్లతో మంజూరైన అమృత్ నీటి పథకాన్ని అటకెక్కించారన్నారు. పర్లపాడు మహేశ్వరరెడ్డి పేరుతో వరద తనయుడు కొండారెడ్డి కాంట్రాక్టు పనులు చేయలేదా అని ప్రశ్నించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో మంజూరైన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పథకం ఏమైందని, కూరగాయల మార్కెట్ ఎందుకు నిర్మించలేకపోయారని ప్రశ్నించారు. 40 ఏళ్ల నుంచి తన కార్యాలయం ఉండే నెహ్రూ రోడ్డులో తిరుగుతున్న వరద ఎందుకు అభివృద్ధి చేయాలేకపోయారని విమర్శించారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ఇంజినీరింగ్ కాలేజిని మంజూరు చేస్తే శాశ్వత భవనాలను నిర్మించకుండా తన కళాశాలను విద్యార్థులకు వరద అద్దెకు ఇచ్చారన్నారు. కనీసం తన హయాంలో చెప్పుకోదగ్గర రీతిలో బడి, గుడిని అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు.

83 ఏళ్ల వయసులో పదవి కావాల్సి వచ్చిందా?

ఆస్తుల కోసం విజయవాడలో బ్రాహ్మణుడిని చంపిందెవరు, డీఏడబ్ల్యూ కాలేజీ స్థలం ఎవరు తీసుకున్నారు అన్నారు. మైదుకూరు రోడ్డు వేసింది ఎవరు, తన సోదరుడు రాఘవరెడ్డి కోసం దువ్వూరు రోడ్డు నాసిరకంగా వేసి 36 సార్లు వేసి బిల్లులు చేసుకున్నారన్నారు. నియోజకవర్గంలో మిగతా రోడ్ల గురించి ఎందుకు పట్టించుకోలేదన్నారు. మున్సిపాలిటీలోని అన్ని వీధుల్లో రోడ్లు, కాలువలు తమ హయాంలో నిర్మించామన్నారు. అభివద్ధి నిరోధకుడిగా పేరున్న వరదను 15 ఏళ్ల క్రితమే ప్రజలు ఇంటికి పంపించారని అన్నారు. సెకండ్ ఇన్నింగ్స్ అంటూ 83 ఏళ్ల వయసులో పదవి కావాల్సి వచ్చిందా అన్నారు. వరదలాంటి అభివృద్ధి నిరోధకుడు మరొకరు లేరని తెలిపారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ టికెట్ వరదకే రావాలని తాను కోరుకుంటున్నానన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం కల్పిస్తున్న ప్రభుత్వం



దివ్యాంగులకు బ్యాటరీ ట్రైసైకిళ్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్సీ డీసీగోవిందరెడ్డి

బద్వేలు అర్బన్ : దివ్యాంగుల్లో ఆత్మస్థైర్యం, మనోధైర్యం కల్పించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అనేక కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి తెలిపారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో జిల్లా సమగ్రశిక్ష ప్రాజెక్టు అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో సామాజిక అధికారిత శిబిర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా అలింకో సంస్థ, కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిల సహకారంతో సమకూర్చిన 12 రకాల ఉపకరణాలను నియోజకవర్గంలోని 731 మందికి పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఆర్‌ఆర్‌డీ ప్రభుత్వ సలహాదారు పి.నాగార్జునరెడ్డి, నగర కార్పొరేషన్ చైర్‌పర్సన్ గానుగపెంట రమణమ్మశీనయ్య, మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ అధ్యక్షుడు సుందర్‌రామిరెడ్డి, జిల్లా కార్యదర్శి యద్దారెడ్డి, మున్సిపల్ వైస్‌చైర్మన్ గోపాలస్వామి, జెడ్పీటీసీ చిన్నపోలిరెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పుత్తాశ్రీరాములు, ఏపీఐఐసీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, టూరిజం కార్పొరేషన్ డైరెక్టర్ అల్లాబకాష్, గోపవరం మండల కన్వీనర్ మల్లికార్జునరెడ్డి, మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి, ఎంపీడీఓ నూర్జహాన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ పరిధిలోని 6 దివ్యాంగుల స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు లింకేజి ద్వారా రూ.39 లక్షల మెగా చెక్కును అందించారు. మున్సిపల్ కమిషనర్ వెంకటరమణయ్య, మెప్మా టీఈ కెజియా జాస్లిన్, సీఓలు రమణారెడ్డి, విమల, శ్రీదేవి, వాణిశ్రీ, నాగలక్ష్మి, హేమలతతోపాటు ఆర్పీలు పాల్గొన్నారు.

■ ఆంధ్రప్రదేశ్ మదర్ థెరిస్సా దివ్యాంగుల సేవా సమితి ఆధ్వర్యంలో స్థానిక అనిబిసెంట్ మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో ఘనంగా అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం నిర్వహించారు. దివ్యాంగులకు రైల్వే పాసులు, బహుమతులు అందించారు. సేవా సమితి అధ్యక్షుడు షాకీర్ హుస్సేన్, రాష్ట్ర బధిరుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీకిశోర్, బాషా, వెంకటసుబ్బయ్య, భద్రుడు, సుబ్బరాయుడు, పవన్ కుమార్, అల్తాఫ్, హనుమంతు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు



విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందిస్తున్న రెడ్ల సేవా సంఘం నాయకులు

ప్రొద్దుటూరు : పేద విద్యార్థులు చదువుకునేందుకు రెడ్ల సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా స్కాలర్‌షిప్‌లను అందించడం జరుగుతోందని ప్రొద్దుటూరు రెడ్ల సేవా సంఘం అధ్యక్షుడు డాక్టర్ డి.నాగదస్తగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి తెలిపారు. స్థానిక పెన్నానది తీరాన ఉన్న రెడ్ల కల్యాణ మండపంలో ఆదివారం రాత్రి ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 53 మంది పేద విద్యార్థులకు రూ.4.60 లక్షలు స్కాలర్‌షిప్‌లను అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంఘం ఏర్పాటైనప్పటి నుంచి ప్రొద్దుటూరులో కులమతాలకు సంబంధం లేకుండా పేద విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లను అందిస్తున్నామన్నారు. గతంలో ఉన్న రెడ్డి సేవా సంఘాన్ని రెడ్ల సేవా సంఘంగా పేరు మార్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వైవీ రామమునిరెడ్డి, ఉపాధ్యక్షుడు శెట్టిపల్లె రాంప్రసాద్‌రెడ్డి, డిప్యూటీ డీఈఓ జి.రాజగోపాల్‌రెడ్డి, రిటైర్డు హెడ్మాస్టర్ వై.చెన్నారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ అట్లా నరసింహారెడ్డి పాల్గొన్నారు.

దాతలు ఆలయాలకు సహకరించడం అభినందనీయం

- 17న ఆలయ పునర్నిర్మాణానికి భూమిపూజ
- ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



వెల్లాల రథశాల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

రాజుపాళెం : వెల్లాల పుణ్యక్షేత్రంలోని ఆలయాలకు దాతలు సహకరించడం అభినందనీయమని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి అన్నారు. మండలంలోని వెల్లాల పుణ్యక్షేత్రంలో పగిడాల గ్రామానికి చెందిన కేవీఆర్ కన్‌స్ట్రక్షన్స్ అధినేత కానాల వెంకటరామిరెడ్డి రూ.16 లక్షలతో నిర్మించిన రథశాలను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. రథశాల వద్ద పూజలు చేశారు. అలాగే సంజీవరాయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ దాతలు ముందుకు వచ్చి ఆలయాలకు సహకరించడం స్వామివారికి సేవ చేయడమేనని తెలిపారు. ఈ నెల 17న చెన్నకేశవ, సంజీవరాయస్వామి ఆలయాల పునర్నిర్మాణానికి భూమి పూజ చేస్తున్నామని, ఇందుకుగాను దేవదాయశాఖ సీజీఎఫ్ నిధులు రూ.3.55 కోట్లతో పనులు ప్రారంభించనునట్లు తెలిపారు. ఈ ఆలయానికి నిధులు మంజూరు చేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కోరామని, ఆ నిధుల మంజూరుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని నిర్మాణానికి నాంది పలికామన్నారు. ఈనెల 24న హనుమత్ వ్రతాన్ని నిర్వహించేందుకు ఘనంగా ఏర్పాట్లు చేస్తున్నామని, అదే రోజు హోమం, అన్నదాన కార్యక్రమం, ఒంటె వాహనంపై సంజీవరాయస్వామి ఊరేగింపు, రాత్రి రెండు తెలుగు రాష్ట్రాల తాళాల భజన పోటీలు ఉంటాయన్నారు.

25 ఏళ్లు అధికారంలో ఉన్నా ఆలయాలను పట్టించుకోని వరద

ప్రొద్దుటూరు ఎమ్మెల్యేగా వరదరాజులరెడ్డి 25 ఏళ్లు ఉన్నారని, ఈ వెల్లాల పుణ్యక్షేత్రానికి కొన్ని వందల సార్లు వచ్చి వెళ్లారే తప్ప ఆలయాలను పట్టించుకోలేదని ఎమ్మెల్యే రాచమల్లు విమర్శించారు. తాము అధికారం చేపట్టిన నాలుగు సంవత్సరాల్లోనే ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టామని తెలిపారు. ఎన్నో ఆలయాలకు తన సొంత నిధులు వెచ్చించానని చెప్పారు. ఇందులో భాగంగా వెల్లాల ఆలయాలను ఎంతో సుందరంగా రూపుదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వెంకటరామిరెడ్డి కుమారుడు ఇందుదర్ రెడ్డికి ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. ఈ రథశాల నిర్మాణానికి సహకారం అందించిన బలరామిరెడ్డి, విజయలక్ష్మిని ఎమ్మెల్యే రాచమల్లు ప్రత్యేకంగా ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు అంజనీకుమారి, ఆలయ చైర్‌పర్సన్ కానాల విజయలక్ష్మి, మండల ఇన్‌చార్జి ఎంపీపీ నారాయణరెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రాజారాంరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి పోరెడ్డి నరసింహారెడ్డి, ఆర్‌పీసీఏ మెంబర్ కాకర్ల నాగేశేషారెడ్డి, వైఎస్సార్‌సీపీ ప్రొద్దుటూరు పట్టణాధ్యక్షులు కామిసెట్టి బాబు, కోనేటి సునంద, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, ఈఓ బీవీ నరసయ్య, నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం

పోరుమామిళ్ల : త్రైత సిద్ధాంతం భగవద్గీత క్షర, అక్షర, పురుషోత్తమ గురించి ఆలయాల్లో ధ్వజస్తంభంపై దీపం వెలిగించడం తదితర అంశాల విశిష్టతల గురించి తెలుపుతుందని ప్రబోధ సేవాసమితి సభ్యులు తెలపారు. పోరుమామిళ్లలో శని, ఆదివారాల్లో సేవా సమితి సభ్యులు త్రైత సిద్ధాంత పరిచయ, ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఆసక్తి ఉన్నవారికి గ్రంథాలను అందించారు.

రేషన్ సక్రమంగా పంపిణీ చేయండి



రేషన్ పంపిణీని పరిశీలిస్తున్న తహసీల్దార్ రమకుమారి

దువ్వూరు : మండలంలోని డీలర్లు, ఎండీయూ ఆపరేటర్లు రేషన్ సక్రమంగా పంపిణీ చేయాలని, కార్డుదారులకు కచ్చితంగా రేషన్ అందించాలని తహసీల్దార్ రమకుమారి తెలిపారు. ఆదివారం దువ్వూరులోని 31, 32, 34 రేషన్ దుకాణాల పరిధిలో రేషన్ పంపిణీని పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ ఎండీయూ ఆపరేటర్లతో మాట్లాడుతూ డీలర్ల నుంచి సరుకులు తీసుకుని ప్రతి కార్డుదారునికి అందించాలని, ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ జాన్సన్, వీఆర్‌ఓ రమణారెడ్డి పాల్గొన్నారు.

ప్రొద్దుటూరు : కానపల్లె గ్రామంలో రేషన్ పంపిణీని తహసీల్దార్ నజీర్ అహ్మద్ ఆదివారం పరిశీలించారు. ఎండీయూ వాహనం వద్దకు వెళ్లి నిబంధనల ప్రకారం రేషన్ అందించాలని, ప్రజల నుంచి ఫిర్యాదులు అందితే చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఆపరేటర్‌ను హెచ్చరించారు. రోజూ అధికారులు రేషన్ పంపిణీని పరిశీలిస్తారన్నారు. ఆయన వెంట పౌరసరఫరాల శాఖ డిప్యూటీ తహసీల్దార్ సుదర్శన్, ఎఫ్‌ఐ సాయిప్రసాద్ పాల్గొన్నారు.

రాజుపాళెంకు చేరిన అయోధ్య అక్షింతలు



శ్రీరాముని అక్షింతలతో కోలాటం బృందం మహిళలు

రాజుపాళెం : అయోధ్య శ్రీరాముని వద్ద పూజించిన అక్షింతలను ఆదివారం సాయంత్రం రాజుపాళెంలోని కోదండ రామాలయం వద్దకు తీసుకువచ్చారు. విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ శోభాయాత్ర పెద్ద సంఖ్యలో భజన సంకీర్తనలు, కోలాటాల మధ్య అంగరంగ వైభవంగా జరిగింది. రామ మందిరం జనవరిలో ప్రారంభోత్సవం జరుగుతున్నందున అక్కడ నుంచి అన్ని గ్రామాలకు అక్షింతలను పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షులు నాగార్జున రావు మాట్లాడుతూ రామాలయంలో ఉంచిన తార్వాత మండలంలో ప్రతి ఇంటింటికీ పంపిణీ చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంఘటన కార్యదర్శి మల్లికార్జున రావు, బీకేఎస్ జిల్లా అధ్యక్షుడు సహదేవరెడ్డి, శ్రీరాములు, సేవకులు, ఆయా గ్రామస్తులు పాల్గొన్నారు.

కాశినాయన : అయోధ్యలోని రామమందిరంలో 2024 జనవరి 22వ తేదీన విగ్రహ ప్రతిష్ఠ జరుగుతున్న సందర్భంగా రాష్ట్రీయ స్వయం సేవక్, విశ్వహిందూ పరిషత్, జనహిత సంఘాల ఐక్యతతో అయోధ్య నుంచి అక్షింతలు రాష్ట్రాలకు, జిల్లా కేంద్రాలకు, మండల కేంద్రాలకు వచ్చాయి. ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం నరసాపురం ఆంజనేయస్వామి గుడి వద్దకు డప్పు వాయిద్యాలు, కోలాటాలు, భజనలతో ఊరేగింపుగా ఆంజనేయస్వామి దేవాలయానికి చేరుకున్నాయి. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

టీటీడీ ధర్మ ప్రచారం భక్తుల కోసమే

పోరుమామిళ్ల : తిరుమల తిరుపతి దేవస్థానములు భక్తుల కోసం నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు వినియోగించుకుని ధర్మమార్గం, భక్తి మార్గం వైపు నడవాలని టీటీడీ కడప జిల్లా నిర్వాహకులు గోపిబాబు, ధర్మప్రచార మండలి సభ్యులు వెంకటసుబ్బారెడ్డి తెలిపారు. టీటీడీ ఆధ్వర్యంలో 5 రోజులుగా పోరుమామిళ్ల వీరాంజనేయస్వామి దేవస్థానంలో తుపాకుల శ్రీనివాసులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ధార్మిక కార్యక్రమాలు పరిశీలించేందుకు వారు ఆదివారం ఇక్కడకు వచ్చారు. గత 5 రోజులుగా నిర్వహించిన రామాయణ, భారత, భగవద్గీత ప్రవచనాలు ప్రజలను సన్మార్గంలో నడిపించేందుకు దోహదపడతాయన్నారు. టీటీడీ నూతన దేవాలయాల ఏర్పాటుకు, పురాతన ఆలయాల పునరుద్ధరణకు, ఆలయాలకు మైక్‌సెట్ అందించేందుకు కృషి చేయడంతో పాటు ఆలయాల్లో ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు.

హిందూ ధర్మాన్ని అభివృద్ధి చేసేందుకే..

రాజుపాళెం : హిందూ ధర్మం అభివృద్ధి కావాలంటే భజనలు చేయాలని అన్నమయ్య కళాక్షేత్రం పీఠాధిపతి విజయ శంకర్‌స్వామి అన్నారు. రాజుపాళెంలోని కోదండ రామాలయంలో ఆదివారం ఆయన మాట్లాడుతూ తిరుమలలో ప్రతినిత్యం భజనలు చేస్తుంటారని, ఆదే విధంగా ఒంటిమిట్ట ఆలయంలో కూడా చేయాలని తెలిపారు. అయితే అక్కడ అధికారులు భజనలు చేసుకోండి అంటారే తప్ప ఎటువంటి సౌకర్యాలు కల్పించలేదన్నారు. దీనిపై డిసెంబరు 8న 20 వేల మందితో శాంతియతంగా వెళ్లి ఆలయ అధికారులను అడుగుతామన్నారు.

బాబూ రాజేంద్రప్రసాద్‌కు ఘన నివాళి

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక శ్రీరాములపేటలోని ఉపాధ్యాయ సేవా కేంద్రంలో ఆదివారం మొదటి రాష్ట్రపతి డాక్టర్ బాబూ రాజేంద్రప్రసాద్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయ సంఘాల సమన్వయవేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ భారత రాజ్యాంగ ముసాయిదా సంఘానికి బాబూ రాజేంద్రప్రసాద్ అధ్యక్షత వహించారని, రెండుసార్లు రాష్ట్రపతిగా సేవలందించిన ఘనత ఆయనకే దక్కిందన్నారు. కార్యక్రమంలో విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు ఒబుళరెడ్డి, మునయ్య, అధ్యాపకుడు సురేంద్రారెడ్డి, సాయికుమార్, సుబ్రహ్మణ్యం, రమణయ్య భాగవతార్ పాల్గొన్నారు.